సాక్షి
అనంతపురం
శుక్రవారం । 25 । ఏప్రిల్ । 2025



టన్ను చీనీ రూ.20 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.20 వేలు ప్రకారం ధర పలికాయి.



నీటి కుంటలో మునిగి ఇద్దరు విద్యార్థుల మృతి

నీటి కుంటలో మునిగి ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు. అయిన వారికి తీరని శోకం మిగిల్చారు.

11లో

గరిష్టం/కనిష్టం
41.5°/24.3°

జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. భానుడి భగభగలతో వేసవితాపం కొనసాగుతోంది. గంటకు 8 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఉత్తమ అవార్డు అందుకున్న కలెక్టర్

• 'స్వచ్ఛ ఆంధ్ర' సమర్థ నిర్వహణకు...



డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కలెక్టర్

అనంతపుర అర్బన్: స్వచ్ఛ ఆంధ్ర (గ్రామీణ) కార్యక్రమాల అమలులో రాష్ట్రస్థాయిలో ఉత్తమ అవార్డును కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అందుకున్నారు. గురువారం మంగళగిరిలో నిర్వహించిన జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం-2025 కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేతుల మీదుగా అవార్డును కలెక్టర్ అందుకున్నారు. ఓడీఎఫ్ ప్లస్ కింద స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను జిల్లావ్యాప్తంగా అన్ని పంచాయతీల పరిధిలో సమర్థవంతంగా నిర్వహించి అన్నింటినీ ఓడీఎఫ్ ప్లస్ మోడల్ గ్రామాలుగా తీర్చిదిద్దినందుకు అవార్డు లభించింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం సమష్టి కృషితోనే అవార్డు వచ్చిందన్నారు.

కేజీబీవీలో అసిస్టెంట్ కుక్ పోస్టులకు దరఖాస్తు

అనంతపురం ఎడ్యుకేషన్: అనంతపురం రూరల్ మండల పరిధిలోని కురుగుంట కేజీబీవీలో ఖాళీగా ఉన్న మూడు అసిస్టెంట్ కుక్ పోస్టుల భర్తీకి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ-1 వెంకటస్వామి, ఎంఈఓ-2 సరితారాణి తెలిపారు. గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈనెల 30లోపు ఎంఈఓ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. 2024 జూలై 1 నాటికి 42 ఏళ్ల పూర్తయి ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ,ఈడబ్ల్యూఎస్ వారు 47 ఏళ్లు, దివ్యాంగులు 52 ఏళ్ల వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మాజీ సర్వీస్ మహిళలకు 45 ఏళ్ల వయసు వరకు అర్హులని తెలిపారు. స్థానిక మహిళలు (గ్రామం/మండలం) మాత్రమే అర్హులని స్పష్టం చేశారు.

అధ్యాపకులకు శిక్షణ ప్రారంభం



శిక్షణలో పాల్గొన్న అధ్యాపకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ విద్యలో ఈ విద్యా సంవత్సరం నుంచి అమలవుతున్న సీబీఎస్‌ఈ, సిలబస్, ప్రశ్నపత్రాల మార్పు తదితర అంశాలపై జూనియర్ కళాశాలల అధ్యాపకులకు శిక్షణ గురువారం ప్రారంభమైంది. స్థానిక కేఎస్ఆర్ ప్రభుత్వ బాలికల కళాశాలలో జరిగిన శిక్షణకు తెలుగు, ఇంగ్లిష్, హిందీ, ఉర్దూ రెగ్యులర్, కాంట్రాక్ట్, గెస్ట్ అధ్యాపకులు హాజరయ్యారు. ఆన్‌లైన్ విధానంలో జరిగిన శిక్షణను ఇంటర్ బోర్డ్ డైరెక్టర్ కృతికా శుక్లా ప్రారంభించి మాట్లాడారు. అనంతరం ఆయా సబ్జెక్టుల నిపుణులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా వృత్తి విద్యా శాఖ అధికారి ఎం.వెంకటరమణ నాయక్ మాట్లాడుతూ అధ్యాపకులకు ఈ శిక్షణ చాలా ఉపయోగపడుతుందన్నారు. నూతన సిలబస్, సంస్కరణలపై శిక్షణ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో కేఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగరత్నమ్మ పాల్గొన్నారు.

కొత్తగా నాలుగు మద్యం షాపులు

అనంతపురం: జిల్లాలో కొత్తగా తాడిపత్రి మున్సిపాలిటీలో మూడు, కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో ఒక మద్యం షాపు ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పి. నాగమద్దయ్య, జిల్లా ఎక్సైజ్ అధికారి బి. రామమోహన్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. రూ.2 లక్షలు (నాన్ రీ ఫండబుల్) డీడీ ద్వారా చెల్లించి, దరఖాస్తుకు ఆధార్ కార్డు జత చేసి మ్యానువల్‌గా జిల్లాలోని అన్ని ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్లలో దరఖాస్తు చేయవచ్చన్నారు. absbcl.gov.in వెబ్‌సైట్ ద్వారా వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. మే 3వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

30న పాలిసెట్

అనంతపురం: డిప్లొమో కోర్సుల్లో అడ్మిషన్ల కోసం ఈ నెల 30న ఏపీ పాలిసెట్-2025ను నిర్వహిస్తున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ సి. జయచంద్రా రెడ్డి తెలిపారు. అభ్యర్థులు తమ హాల్‌టికెట్లను www.polycetap.nic.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆయన సూచించారు.

బాధితుల పక్షాన నిలబడాల్సిన కొందరు ఖాకీలు సెటిల్‌మెంట్లే ధ్యేయంగా పనిచేస్తున్నారు. ఎమ్మెల్యేలు ఏది చెబితే అది ఎఫ్ఐఆర్‌లో చేరుస్తున్నారు. బాధితులతో పద్ధతిగా మాట్లాడకుండా బూతులు తిడుతున్నారు. డబ్బు ఎవరు ఎక్కువ ఇస్తారో వారికే న్యాయం చేస్తున్నారు.

- టీడీపీ నేతల అండతో కొందరు ఖాకీల విచ్చలవిడితనం
- ఎమ్మెల్యేలే బాసులుగా విధులు నిర్వర్తిస్తున్న సీఐలు
- రాత్రి పదిన్నర తర్వాతే కదిరి అర్బన్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్‌లు
- ఇటుకలపల్లి సీఐ దగ్గరికెళితే కేసులతో పాటు బూతులు బోనస్
- రాయదుర్గం సీఐ జయ.. ఆయనకు లేనిదే దయ అనే విమర్శలు
- పుట్టపర్తి ఎస్పీ ఆఫీసులో స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ ప్రదీప్ హవా



అంతా మా ఇష్టం..

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో కొంతమంది సీఐల వ్యవహార శైలితో ఖాకీ చొక్కాకు అవినీతి మరకలంటుకున్నాయనే విమర్శలున్నాయి. కదిరి అర్బన్ పోలీస్‌స్టేషన్ సీఐగా ఉన్న నారాయణరెడ్డిపై తీవ్ర అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల గంజాయి కేసులో పట్టుబడిన వారిని ఉదారంగా వదిలేసి కేవలం బైండోవర్‌తో సరిపెట్టారనే విమర్శలున్నాయి. రాత్రి పదిన్నర వరకూ ఎఫ్ఐఆర్‌లు నమోదు కావని, సెటిల్‌మెంట్ సక్సెస్ అయితే ఎఫ్ఐఆర్ ఊసే ఉండదని, కుదరకపోతే కేసు నమోదవుతుందని బాధితులు చెబుతున్నారు. సీఐ కార్యాలయం ఎప్పుడూ సివిల్ పంచాయితీలతో బిజీగా ఉంటోందని తెలిసింది.

'జయ'.. కానరాని దయ

రాయదుర్గం అర్బన్ సీఐ జయానాయక్‌కు దయ అనేది ఎక్కడా లేదన్న విమర్శలున్నాయి. ఈ స్టేషన్‌లో రోజూ సివిల్ పంచాయితీలు ఎక్కువగా జరుగుతున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల ఓ వివాదంలో బాధితుడి నుంచి భారీగా డబ్బు చేతులు మారినట్టు బాధితుల తరఫు బంధువులు చెప్పారు. స్టేషన్‌కు వచ్చే వారిపట్ల దారుణంగా వ్యవహరిస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధికి మాత్రమే సేవకుడిగా ఉంటున్నారనే విమర్శలున్నాయి.

హేమంత్ నోట బూతులే..

ఇటుకలపల్లి సీఐగా ఉన్న హేమంత్‌కుమార్ నోటికొచ్చినట్టు బూతులు తిడుతున్నట్టు బాధితులు వాపోతున్నారు. పరిటాల శ్రీరామ్‌కు అనుంగు అనుచరుడిగా ఉన్న ఈయన టీడీపీ నేతల అండచూసుకుని రెచ్చిపోతున్నట్టు ఇటీవల ఓ బాధితుడు చెప్పారు. మొన్నటికి మొన్న అక్రమంగా మట్టి తోలుతున్న రెండు టిప్పర్‌లు పట్టుకుని తెల్లారేసరికి వదిలేశారు. వారితో సెటిల్‌మెంట్ చేసుకున్నట్టు తేలింది. టీడీపీ నేతలు చెబితే ప్రత్యర్థులను అకారణంగా స్టేషన్‌కు పిలిపించడం, బెదిరించడం చేస్తున్నట్టు చెబుతున్నారు. స్టేషన్‌కు వెళ్లిన వారికి కనీస మర్యాద ఇవ్వకుండా నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ కార్యకర్తగా ఎస్ఐ సుధాకర్

జిల్లాలోనే కాదు రాష్ట్రంలోనే ఖాకీ డ్రెస్సు వేసుకుని పొలిటికల్ పార్టీకి కొమ్ముకాస్తున్న పోలీసుగా రామగిరి ఎస్ఐ సుధాకర్ గుర్తింపు పొందారు. పరిటాల కుటుంబానికి పనిమనిషిగా ఉన్నట్టు కూడా ఆరోపణలున్నాయి. ఇటీవల రామగిరి వైస్ ఎంపీపీ ఎంపికలో ఎంపీటీసీలను బెదిరించడం, వారిని టీడీపీ వ్యానులో ఎక్కించడం వంటివి బహిరంగంగా చేశారు. బాధితులను భయభ్రాంతులకు గురిచేశారు. పక్కా టీడీపీ కార్యకర్తలా సామాజిక మాధ్యమాల్లో మాట్లాడినా ఇతనిపై శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ రత్న వీసమెత్తు చర్యలు తీసుకోలేదు.

ఎస్‌బీ ఎస్ఐ ప్రదీప్ కీలకంగా..

శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఆఫీసులో స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐగా పనిచేస్తున్న ప్రదీప్.. ప్రస్తుతం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారారు. తనపై అధికారులకు పనులు చక్కబెట్టడంలో దిట్ట అని పేరుంది. చాలా మంది సీఐలు, డీఎస్పీలకు జరగని పనులు ప్రదీప్‌కు జరుగుతాయి. సెటిల్‌మెంట్ల ద్వారా పై అధికారులకు ఆర్థిక చేయూతనివ్వడం, ఎప్పటికప్పుడు ఏ పోలీసు అధికారి ఏం చేస్తున్నారో పెద్దబాస్‌కు చెప్పడం ఇతని పని. దీంతో పోలీసు అధికారులు చాలామంది ప్రదీప్ అంటే భయపడిపోతున్నారు. జిల్లాలో ప్రదీప్ ఏది చెబితే అది జరుగుతుందని చెబుతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

నేడు నాసిన్‌లో పాసింగ్ అవుట్ పరేడ్

గోరంట్ల: గోరంట్ల మండలం పాలసముద్రం సమీపంలోని సెంట్రల్ ఎక్సైజ్ అకాడమీ అండ్ నార్కోటిక్స్ (నాసిన్) సంస్థలో శుక్రవారం ఐఆర్ఎస్ 75వ బ్యాచ్ పాసింగ్ ఔట్ పరేడ్ ఉంటుంది. ఈ మేరకు ఆ సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి పాల్గొననున్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ



సత్తా చాటిన క్రీడాకారులు

అనంతపురం: రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు 9 పతకాలు సాధించారు. ఏప్రిల్ 2,3 తేదీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా తెనాలిలో 5వ రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలు నిర్వహించారు. బి. సాయి తన్ని (ప్రథమ స్థానం- బంగారు పతకం), వై. ప్రణవి శ్రీ సాయి, ఎస్. సుశాంత్, ఎల్. హర్షవర్ధన్ రెడ్డి (రెండో స్థానం- రజత పతకం), బి. తమన్‌సాయి, ఎస్.రాయద్, ఎస్. ఆశ్రిత, ఎస్ .హేమశ్రీ, టి.భవేష్ (మూడో స్థానం- కాంస్య పతకాలు) సాధించారు. విజేతలను తైక్వాండో రాష్ట్ర సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణ, వెంకట్ అభినందించారు.

అడ్డగోలు నియామకాలకు అడ్డుకట్ట

సమగ్రశిక్ష సెక్టోరియల్ ఆఫీసర్ల నోటిఫికేషన్ రద్దు

- కమిషనర్ ఉత్తర్వులు
- పూర్వపు డీఈఓ నిర్వాకంతో విద్యా సంవత్సరం మధ్యలోనే సెక్టోరియల్ ఆఫీసర్లు రిలీవ్
- కొత్తగా తీసుకునేందుకు హడావుడి నోటిఫికేషన్

అనంతపురం ఎడ్యుకేషన్: పూర్వ జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి నిర్వాకం.... సమగ్రశిక్ష కార్యాలయాన్ని నేటికీ వెంటాడుతోంది. కమిషనర్ ఉత్తర్వులను తుంగలో తొక్కుతూ తీసుకున్న అడ్డగోలు నిర్ణయాన్ని ఉన్నతాధికారులు తప్పుపట్టారు. ఈ క్రమంలో సెక్టోరియల్ ఆఫీసర్ల నియామకానికి సంబంధించి జారీ చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేశారు. తాజాగా వేసవి సెలవుల్లో నోటిఫికేషన్ జారీ చేసి 15 రోజుల్లోగా భర్తీ చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో జిల్లాలో నేడో, రేపో కొత్త నోటిఫికేషన్ జారీ చేయనున్నారు.

అసలేం జరిగిందంటే...

సమగ్ర శిక్షలో సెక్టోరియల్ అధికారులుగా ఎవరినైనా తీసుకోవాలన్నా... ఉన్నవారిని తప్పించాలన్నా విద్యా సంవత్సరం మధ్యలో కాకుండా వేసవి సెలవుల్లో చర్యలు తీసుకోవాలని స్వయంగా విద్యాశాఖ కమిషనర్ గతంలో స్పష్టమైన ఉత్తర్వులు ఇచ్చారు. అయితే, అప్పటి డీఈఓ, ఏపీసీలు ఆస్మదీయుల కోసం అడ్డగోలు నిర్ణయం తీసుకుని ఏపీఓను తప్ప తక్కిన సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులందరినీ ఒకేసారి 2024 జూలై 31న రిలీవ్ చేయించారు. రాష్ట్రంలో తక్కిన 25 జిల్లాల్లో ఎక్కడా ఇలాంటి నిర్ణయాలు తీసుకోలేదు. ఆగమేఘాల మీద ఆగస్టు 1న కొత్తవారిని తీసుకునేందుకు నోటిఫికేషన్ ఇచ్చారు. ఎక్కడా తన చేతికి మట్టి అంటకుండా కలెక్టర్‌నే బురిడీ కొట్టించి ఆయనతోనే సంతకాలు చేయించారు. చివరకు సమగ్ర శిక్షలో పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్‌ను రీ ప్యాట్రియేషన్ అధికారం ఏపీసీకే ఉంటుంది. ఇదికూడా కలెక్టర్‌తోనే చేయించారు. ఆ తర్వాత ఇంటర్వ్యూలు చేపట్టారు. కలెక్టర్‌తో ఆమోద ముద్ర వేయించి కమిషనర్ ఆమోదం కోసం జాబితాను పంపారు.

ఐదుగురి పేర్లు పంపితే నలుగురికి గ్రీన్ సిగ్నల్..

రాష్ట్ర అధికారులకు పంపిన ఐదుగురి జాబితాలో నలుగురి నియామకానికి గ్రీన్‌సిగ్నల్ ఇస్తూ ఈ ఏడాది ఫిబ్రవరిలో ఉత్తర్వులు జారీ చేశారు. ఏఎంఓగా ఆనందభాస్కర్‌రెడ్డి, జీసీడీఓగా కవిత, అలెస్కోగా గురుమూర్తి, అసిస్టెంట్ ఏఎంఓ (జనరల్)గా ఫణిరాజు నియామకాలకు ఆమోదం తెలిపారు. అసిస్టెంట్ ఏఎంఓ (కన్నడ) పోస్టుకు తీవ్రంగా ప్రయత్నం చేసిన రామగిరి కిష్టప్ప, జీసీడీఓ, మరో అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారి పోస్టుకు తీవ్రంగా ప్రయత్నం చేసిన వారి పేర్లు జాబితాలో లేకపోయేసరికి ముగ్గురు ప్రజాప్రతినిధులు ఎవరికివారు ఉన్నతాధికారులపై ఒత్తిళ్లు చేయడంతో ఈ ప్రక్రియ అంతటితో ఆగిపోయింది.

ఎస్జీటీలూ అర్హులే

సమగ్ర శిక్ష పరిధిలోని సెక్టోరియల్ అధికారుల పోస్టులకు గతంలో హెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు మాత్రమే అర్హులు. ఆ తర్వాత కేవలం స్కూల్ అసిస్టెంట్లు మాత్రమే అర్హులని కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. తాజాగా మరో రకంగా ఆదేశాలిచ్చారు. ఇందులో ఎస్జీటీలు కూడా అర్హులేనని స్పష్టం చేశారు.



'సమగ్ర'లో ముగ్గురి రీప్యాట్రియేషన్

సమగ్రశిక్షలో ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు, ఒక జూనియర్ అసిస్టెంట్‌ను విద్యాశాఖకు రీ ప్యాట్రియేషన్ చేశారు. ఈ మేరకు ఏపీసీ ఉత్తర్వులు జారీ చేశారు. సీనియర్ అసిస్టెంట్లు షబానా, మధుసూదన్‌రావు, జూనియర్ అసిస్టెంట్ బాలకుళ్లాయప్పను మాతృశాఖకు పంపారు. విధుల్లో అలసత్వం కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఈ ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లను గతంలో డీఈఓగా పని చేసిన వరలక్ష్మి అదేపనిగా ఇక్కడికి పంపారు. ఇక్కడ పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్‌కు లబ్ధి కల్గించే క్రమంలో ఈ నిర్ణయం తీసుకున్నారనే ప్రచారం ఉంది. ఇక్కడ ఇద్దరు ఉద్యోగులు ఉన్నా...వారి నుంచి ఎలాంటి పనులూ చేయించుకోలేకపోతున్నామని ఏపీసీ పలుమార్లు డీఈఓ దృష్టికి తీసుకెళ్లారు. తాజాగా వారిని రీప్యాట్రియేషన్ చేశారు.

సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యం

• జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ



అధికారికి ప్రశంసా పత్రాలను అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేశారని ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జెడ్పీ కార్యాలయ ఆవరణలోని డీపీఆర్సీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 73వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీరాజ్ వ్యవస్థకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. పంచాయతీ రాజ్ వ్యవస్థను బలపరిచే ఆలోచనతో గ్రామ సచివాలయాలను ప్రవేశపెట్టి ప్రతి శాఖకు చెందిన అధికారులను ప్రజలకు అందుబాటులో ఉంచి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిజమైన గ్రామ స్వరాజ్య స్థాపన చేశారని కొనియాడారు. ఉత్తమ సేవలు అందించిన ఆవులెన్న, వ్యాసాపురం, గన్నేవారిపల్లికి చెందిన ముగ్గురు సర్పంచ్‌లకు, 29 మంది సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. అంతకుముందు గాంధీజీ విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. కశ్మీర్‌లో ఉగ్రదాడిలో మృతి చెందిన 28 మందికి సంతాపం ప్రకటించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య, డీపీఓ కార్యాలయ పాలనాధికారి నాగరాజు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీ సెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

బత్తలపల్లి: పదో తరగతి ఫలితాల్లో 500 మార్కులు పైబడి వచ్చిన విద్యార్థులు ఆర్డీటీ సెట్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఆ సంస్థ రీజినల్ డైరెక్టర్ ప్రమీల, ఏటీఎల్ కృష్ణ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా పేద విద్యార్థులను ఇంటర్ చదివించేందుకు ఆర్డీటీ అవకాశం కల్పిస్తోందన్నారు. 500 మార్కులు పైబడి సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల్లో ఆర్డీటీ స్పాన్సర్‌షిప్ కలిగి ఉంటే ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో చదివి ఉన్నా అర్హులన్నారు. ఓసీ, బీసీ, స్పాన్సర్‌షిప్ లేనివారు కేవలం ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే చదివి ఉండాలన్నారు. శుక్రవారం నుంచి స్థానిక ఫీల్డ్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయవచ్చన్నారు. 30వ తేదీ వరకూ దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. మే 11న పరీక్ష ఉంటుందన్నారు. ఆర్డీటీ సెట్‌కు దరఖాస్తు చేసుకునేవారు ఆధార్, రేషన్‌కార్డు, పదో తరగతి హాల్ టికెట్, మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రం, రెండు పాస్ ఫొటోలు తీసుకురావాలని సూచించారు.

● ఉక్కపోత.. ఉక్కిరిబిక్కిరి



సదరం సర్టిఫికెట్ పరిశీలన కోసం నేలపైనే కూర్చున్న దివ్యాంగుడు



సర్వజనాస్పత్రిలో మెడికల్ సర్టిఫికెట్ల పరిశీలన కోసం క్యూలో నిల్చున్న ఉపాధ్యాయులు



సదరం సర్టిఫికెట్ పరిశీలన కోసం బారులు తీరిన దివ్యాంగులు, కుటుంబీకులు



ఆస్పత్రి పరిసరాల్లో కుమారుడిని ఓదార్చుతున్న తల్లి

అనంతపురం మెడికల్: ధ్రువీకరణ పత్రాల రీ వెరిఫికేషన్ ప్రక్రియ టీచర్లు, దివ్యాంగులను ఉక్కిరిబిక్కిరి చేసింది. గురువారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి మెడికల్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌తో పాటు దివ్యాంగుల సదరం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరిగింది. డీఈఐసీ, బర్న్స్, ఆప్తాల్మిక్ వార్డుల్లో ఉపాధ్యాయుల సర్టిఫికెట్లు పరిశీలించారు. మొదటి రోజు జిల్లాకు చెందిన 500 మందికిపైగా ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఇక.. సదరం సర్టిఫికెట్లకు సంబంధించి ఈఎన్‌టీ, సైకియాట్రీ వార్డులో ప్రక్రియ చేపట్టారు. తగిన ఏర్పాట్లు లేకపోవడంతో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దివ్యాంగులు ప్రత్యక్ష నరకం చూశారు. ఉక్కపోతతో అల్లాడిపోయారు. నడవలేని స్థితిలో ఉన్న వారిని మోసుకుంటూ కుటుంబసభ్యులు అష్టకష్టాలు పడ్డారు. పగవానికి కూడా ఇలాంటి ఇబ్బంది రాకూడదని పలువురు వాపోయారు. వేలాది మంది వస్తారని తెలిసినా కేవలం 20 మంది కూర్చొనేందుకు చైర్లు వేశారు. ఈ క్రమంలో చేసేది లేక చాలా మంది చెట్ల కింద కూర్చున్నారు. దీనికితోడు తాగు నీటి సౌకర్యం కూడా సరిగా కల్పించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఎండల తాకిడి అధికంగా ఉన్న నేపథ్యంలోనూ ఆస్పత్రి ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సర్వత్రా విమర్శలకు తావిచ్చింది.



సర్టిఫికెట్ రీ వెరిఫికేషన్ కోసం టీచర్‌ను తీసుకెళ్తున్న కుటుంబీకులు

కరువు మండలాలకు పశువుల దాణా

అనంతపురం అగ్రికల్చర్: గత ఖరీఫ్‌లో ప్రకటించిన కరువు పీడిత మండలాలకు రాయితీతో పశువుల దాణా (క్యాటిల్ ఫీడ్) పంపిణీకి చర్యలు తీసుకున్నట్లు పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ జీపీ వెంకటస్వామి తెలిపారు. ఈ అంశంపై గురువారం స్థానిక పశుశాఖ కార్యాలయంలో ఏడీలు డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ రాధిక, డాక్టర్ సురేష్‌తో కలసి అనంతపురం, పెనుకొండ డీడీలు డాక్టర్ రమేష్‌రెడ్డి, డాక్టర్ వెంకటేష్‌తో పాటు పశు వైద్యశాలల ఏడీలతో టెలీ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. గత ఖరీఫ్‌లో అనంతపురం, నార్పల, విడపనకల్లు, యాడికి, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, రాప్తాడు మండలాలను కరువు జాబితాలో ప్రకటించినట్లుగా గుర్తు చేశారు. ఆయా మండలాల్లో 50 శాతం రాయితీతో దాణా పంపిణీకి అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఒక్కో మండలానికి 25 టన్నుల ప్రకారం ప్రస్తుతానికి 175 టన్నుల దాణా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. 50 కిలోల బస్తా రూ.1,100 కాగా, ఇందులో రైతులు తమ వాటా కింద రూ.550 ప్రకారం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇండెంట్ సిద్ధం చేసి కలెక్టర్ అనుమతితో త్వరలోనే సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. మొదటి ప్రాధాన్యత కింద కరువు మండలాలు, ఆ తర్వాత అవసరాన్ని బట్టి రబీలో ప్రకటించిన కరువు మండలాలు, అలాగే డిమాండ్ కలిగిన ఇతర ప్రాంతాల్లోనూ పంపిణీకి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పంపిణీ సమయంలో సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

క్లుప్తంగా

కనకదాస ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చాటిన కురుబ విద్యార్థులకు కనకదాస ప్రతిభా పురస్కారాలను అందజేయనున్నట్లు కురుబ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షురాలు ఆర్వేటి పద్మావతి, ప్రధానకార్యదర్శి మంగళకుంట నాగరాజు తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు.పదో తరగతిలో 500, ఆపై మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, 550, ఆపై మార్కులు సాధించిన ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు అర్హులన్నారు. అలాగే ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 400, ఆపై మార్కులు సాధించిన ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు, 420, ఆపై మార్కులు సాధించిన ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు, సీనియర్ ఇంటర్‌లో 850, ఆపై మార్కులు సాధించిన ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు, 900, ఆపై మార్కులు సాధించిన ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు దరఖాస్తులను మే 5వ తేదీ లోపు పద్మావతి, జిల్లా అధ్యక్షురాలు, కురుబ ఉద్యోగుల సంక్షేమ సంఘం, కనకదాస కల్యాణమంటపం, గుత్తి రోడ్డు, అనంతపురం చిరునామాకు పంపాలని కోరారు. సమాచారం కోసం 94407 05625, 94933 68696, 99897 42323, 94404 55836 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కొత్త రైల్వే లైన్లకు గ్రీన్ సిగ్నల్

- గుంతకల్లు డివిజన్ పరిధిలో రూ.వందలాది కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులు
- రూ.600 కోట్లతో కొత్త రైల్వే లైన్ల నిర్మాణం
- కొత్త సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటుకు మరో రూ.700 కోట్లు


వెస్ట్ గుంతకల్లు ఆర్ఎస్ వద్ద చేపట్టిన బైపాస్ లైన్ పనులు

గుంతకల్లు: రైలు ప్రయాణికుల కష్టాలకు తెరదించేలా గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలో రూ. వందలాది కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈ పనులకు సంబంధించి రైల్వే శాఖ ఆమోద ముద్ర వేసింది. ఈ నేపథ్యంలో కొత్త రైల్వే లైన్లు, బైపాస్ లైన్‌తో పాటు ఆధునిక సిగ్నలింగ్ వ్యవస్థ అందుబాటులోకి రానుంది. ఇందు కోసం దాదాపు రూ.1,300 కోట్లు ఖర్చు పెడుతున్న సంబంధిత డివిజన్ అధికారులు వెల్లడించారు.

గూడ్స్ రైళ్ల జంక్షన్‌గా వెస్ట్ గుంతకల్లు ఆర్ఎస్

ప్రయాణికుల రైళ్ల రాకపోకలకు ఎలాంటి అవాంతరాలు ఏర్పడకుండా కొత్త రైల్వే లైన్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. డివిజన్ కేంద్రానికి 4 కి.మీ.ల దూరంలో ఉన్న వెస్ట్ గుంతకల్లు రైల్వే స్టేషన్‌ను మరింత అభివృద్ధి పరిచి గూడ్స్ రైళ్ల జంక్షన్‌గా మార్చేందుకు చర్యలు తీసుకున్నారు. ఇందు కోసం రూ.300 కోట్లు వెచ్చించి కొత్త లైన్‌తో పాటు స్టేషన్ యార్డు విస్తరణ, స్టేషన్ భవనాల ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలో కొత్తగా రెండు రైల్వే లైన్లు అందుబాటులోకి రానున్నాయి. గుంతకల్లు–బళ్లారి సెక్షన్‌లో గుంతకల్లు రైల్వే జంక్షన్‌కు నాలుగు కి.మీ.ల దూరంలో వెస్ట్ గుంతకల్లు రైల్వే స్టేషన్ ఉంది. రెండు లైన్లు గుంతకల్లు నుంచి, మరో రెండు లైన్లు బళ్లారి వైపు నుంచి ఈ రైల్వేస్టేషన్ గుండా వెళుతున్నాయి. అలాగే గుంతకల్లు–గుంటూరు రైలు మార్గంలో గుంతకల్లు జంక్షన్‌కు 7.కి.మీ.ల దూరంలో ఉన్న మల్లప్పగేట్ స్టేషన్‌కు రోడ్డు ఓవర్ రోడ్డు వంతెనతో కూడిన రైలు మార్గాన్ని నిర్మిస్తున్నారు. ఈ మార్గం పూర్తయితే గూడ్స్ రైళ్లు గుంతకల్లు జంక్షన్ లోకి ప్రవేశించకుండా నేరుగా బళ్లారి, గుంటూరు దిశగా వెళ్లిపోతాయి. అలాగే రూ.300 కోట్లతో గుంతకల్లు–ఆదోని రైలు మార్గం నుంచి బైపాస్‌లైన్ ఏర్పాటు చేసి 8 కి.మీల దూరంలో ఉన్న గుంతకల్లు రైల్వేస్టేషన్‌కు కలుపనున్నారు. ఈ కొత్త రైల్వే లైన్, బైపాస్ లైన్ నిర్మాణాలు పూర్తయితే ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాకపోకలకు ఎలాంటి అంతరాయం ఉండదు. దీంతో పాటు వెస్ట్ గుంతకల్లు రైల్వేస్టేషన్ కాస్త గూడ్స్ రైళ్ల జంక్షన్‌గా రూపాంతరం చెందుతుంది.

ఆధునిక సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటుకు శ్రీకారం

గుంతకల్లు డివిజన్‌లో ప్రధాన రైలు మార్గంగా ఉన్న వాడి–గుంతకల్లు–రేణిగుంట సెక్షన్‌లో ఆధునిక సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటుకు డివిజన్ అధికారులు ముమ్మర చర్యలు చేపట్టారు. ఇందు కోసం దాదాపు రూ.700 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ప్రస్తుతమున్న అబ్స్యల్యూట్ వ్యవస్థతో రైళ్లు ఒక స్టేషన్ నుంచి మరో స్టేషన్‌కు చేరుకున్నాకే మరో రైలును ఆ మార్గంలో వదలడానికి అవకాశం ఉంది. అయితే ఆధునిక ఆటోమెటిక్ సిగ్నలింగ్ వ్యవస్థతో రెండు స్టేషన్ల మధ్య వరుసగా పలు రైళ్లను ఒకేసారి నడపడానికి అవకాశం ఉంటుంది. ప్రతి సిగ్నల్‌లో నాలుగు రకాల లైట్లు ఉంటాయి. పచ్చలైట్ పడితే రైళ్లను వేగంగా నడపాలని, రెండు పసుపు పచ్చ సిగ్నళ్లు పడితే కొంత వేగాన్ని తగ్గించి నడపాలని, ఒక పసుపు పచ్చ లైటు వెలిగితే మరి కొంత నిదానంగా వెళ్లాలని, ఎర్ర సిగ్నల్ పడితే రైలు ఆగాలని సిగ్నలింగ్ వ్యవస్థలో పొందుపరిచారు. ఈ కొత్త సిగ్నలింగ్ వ్యవస్థను తొలితగా గుంతకల్లు–వాడి మధ్య 229 కి.మీ.లు, గుంతకల్లు–రేణిగుంట మధ్య 310 కి.మీ.లు మొత్తం 538 కి.మీ.లు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రస్తుతం గుంతకల్లు–వాడి సెక్షన్‌లోని గుంతకల్లు–మొలగవల్లి మధ్య 20 కి.మీ. కొత్త సిగ్నల్ వ్యవస్థను అధికారులు అందుబాటులోకి తెచ్చారు. ఒక కి.మీ. సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటుకు దాదాపు రూ.1.4 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు డివిజనల్ సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ అధికారులు తెలిపారు. ప్రతి కి.మీ.కు ఓ సిగ్నల్ ఉంటుంది. ఈ వ్యవస్థను అనుసంధానిస్తూ రైల్వేస్టేషన్లలో కొత్త సర్క్యూలైట్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. దీంతో ప్రయాణికులకు పడిగాపుల కష్టాలు తీరడంతో పాటు వేగంతో పాటు ఒకేసారి ఎక్కువ సంఖ్యలో రైళ్లు ప్రయాణించడానికి వీలవుతుంది.


గూడ్స్ రైళ్ల జంక్షన్‌గా మారనున్న వెస్ట్ గుంతకల్లు రైల్వేస్టేషన్

రైల్వే స్టేషన్‌లో విస్తృత తనిఖీలు


ప్రయాణికుల బ్యాగులను పరిశీలిస్తున్న దృశ్యం

తాడిపత్రి టౌన్: రైళ్లలో గంజాయి, అక్రమ మద్యం రవాణాను అరికట్టే దిశగా పోలీసులు గురువారం తెల్లవారుజామున తాడిపత్రి రైల్వే స్టేషన్‌లో విస్తృత తనిఖీలు చేపట్టారు. స్థానిక సీఐ సాయిప్రసాద్, ఎస్ఐ గౌస్‌బాషా నేతృత్వంలో జిల్లా కేంద్రం నుంచి స్నిఫ్ఫర్ డాగ్‌తో పాటు వచ్చిన ప్రత్యేక పోలీసు బృందం తనిఖీలు కొనసాగించారు.

బాలుడి ఆత్మహత్యాయత్నం

గుత్తి రూరల్: నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం కొత్తబురుజు గ్రామానికి చెందిన ఓ బాలుడు గురువారం ఆత్మహత్యాయత్నం చేశాడు. పోలీసులు తెలిపిన మేరకు.. తమ మాట వినకుండా ఇష్టానుసారంగా తిరుగుతున్న కుమారుడిని తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపం చెందిన బాలుడు గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో విషపూరిత ద్రావకం తాగాడు. ఆలస్యంగా ఇంటికి చేరుకున్న తల్లిదండ్రులు.. అప్పటికే అపస్మారక స్థితికి చేరుకున్న బాలుడిని గమనించి వెంటనే గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తరలించారు. ఘటనపై గుత్తి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

అదృశ్యమైన వ్యక్తి మృతి


మృతుడు కరేగౌడ

గార్లదిన్నె/బ్రహ్మసముద్రం: కనిపించకుండా పోయిన బ్రహ్మసముద్రం మండలం కోనాపురం గ్రామానికి చెందిన దండు కరేగౌడ (44) గురువారం ఉదయం గార్లదిన్నె వద్ద మృతదేహమై కనిపించాడు. పోలీసులు తెలిపిన మేరకు... కొంత కాలంగా మానసికంగా ఇబ్బంది పడే కరేగౌడ ఈ నెల 19న గార్లదిన్నెలో నివాసముంటున్న చెల్లెలు ఇంటికి వచ్చాడు. మరుసటి రోజు సాయంత్రం అలా బయటకు వెళ్లి వస్తానంటూ చెల్లెలుకు తెలిపి ఇల్లు విడిచిన వెళ్లిన ఆయన రాత్రయినా రాకపోవడంతో కుటుంబసభ్యులు గాలింపు చేపట్టారు. చివరకు బంధువులు ఊర్లలోనూ ఆచూకీ లభ్యం కాలేదు. గురువారం మధ్యాహ్నం గార్లదిన్నెలోని అక్షర ఇంటర్నేషనల్ పాఠశాల సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. వడదెబ్బతో మృతి చెందినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పోలీసులు వైరల్ చేయడంతో గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే అప్రమత్తమై మృతదేహాన్ని పరిశీలించి, మృతుడిని కరేగౌడగా నిర్ధారించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు గార్లదిన్నె పీఎస్ ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు.

మెడికో ఆత్మహత్యాయత్నం

- పెంచికలపాడు విశ్వభారతి మెడికల్ కళాశాలలో ఘటన


కోడుమూరు రూరల్: గూడూరు మండలం పెంచికలపాడు విశ్వభారతి మెడికల్ కళాశాలకు చెందిన ఓ విద్యార్థిని కళాశాలపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. వివరాలు.. అనంతపురం జిల్లా ఆత్మకూరుకు చెందిన శ్రీనివాసులు, అనిత దంపతులకు ఇద్దరు కుమార్తెలు సంతానం కాగా, పెద్ద కుమార్తె హన్సిక.. విశ్వభారతి మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఇటీవల నిర్వహించిన పరీక్ష సరిగా రాయలేకపోవడంతో మనస్తాపం చెందిన ఆమె గురువారం సాయంత్రం కళాశాల రెండో అంతస్తుపై నుంచి దూకింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆమెను సహ విద్యార్థులు సిబ్బంది వెంటనే కళాశాలలోని హాస్పిటల్‌కు తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఘటనపై కె.నాగలాపురం పోలీసులు విచారణ చేపట్టారు.

యువకుడి బలవన్మరణం


సిద్ధు నాయక్ (ఫైల్)

రాప్తాడు రూరల్: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం రూరల్ మండలం నరసనాయనికుంటకు చెందిన రామచంద్ర నాయక్ కుమారుడు సిద్ధునాయక్ (19) 5వ తరగతి వరకు చదువుకున్నాడు. కేటరింగ్ కార్మికుడిగా పని చేసుకుంటూ కుటుంబానికి చేదోడుగా ఉండేవాడు. కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతుండడంతో తల్లిదండ్రులు పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించారు. నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న సిద్ధు నాయక్ గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా ఇంటికి చేరుకున్న అవ్వ.. విగతజీవిగా ఉరికి వేలాడుతున్న సిద్ధునాయక్‌ను చూసి గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని యువకుడి మృతదేహాన్ని కిందకు దించారు. సమాచారం అందుకున్న అనంతపురం రూరల్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

15 మంది చిన్నారులకు బీఎంటీ చికిత్స


తలసేమియా బాధిత చిన్నారులతో వైద్యులు, సంకల్ప్ ఫౌండేషన్ ప్రతినిధులు

అనంతపురం మెడికల్: ఉమ్మడి జిల్లాలోని 15 మంది తలసీమియా బాధిత చిన్నారులకు బెంగళూరులోని సంకల్ప్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయనున్నట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు. బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌పై తలసీమియాతో బాధపడుతున్న చిన్నారులు, వారి తల్లిదండ్రులకు గురువారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. తలసీమియా బాధిత చిన్నారులకు అందించి సదుపాయాలను సంకల్ప్ ఇండియా ఫౌండేషన్ ప్రతినిధి అంకాలజిస్టు డాక్టర్ మోహన్ రెడ్డి, అభిజీత్, పుష్ప వివరించారు. డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... తలసీమియాతో బాధపడే చిన్నారులకు ప్రివెంటివ్, చికిత్సనందించేందుకు సంకల్ప్ ఇండియా ఫౌండేషన్ సహాయం చేస్తోందన్నారు. సర్వజనాస్పత్రిలో గైనిక్ విభాగంలో తలసీమియా జన్యు లోపాన్ని గుర్తించడానికి ప్రత్యేక ల్యాబ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 20 వారాలున్న 1,500 మంది గర్భిణుల్లో తలసీమియా జన్యులోపాన్ని గుర్తించేందుకు పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో 40 మందిలో జన్యులోపం ఉన్నట్లు గుర్తించామన్నారు. వీరిలో 8 మంది ఫుల్ మ్యాచింగ్, మరో ఏడుగురు హాఫ్ మ్యాచింగ్ అయ్యారన్నారు. అంకాలజిస్టు డాక్టర్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ... కేంద్రం సహకారంతో చిన్నారులకు బెంగళూరులోని జైన్ ఆస్పత్రిలో చికిత్సనందిస్తారన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జునరెడ్డి, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ రవికుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రవీణ్‌దీన్‌కుమార్, డాక్టర్ శంకర్‌నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు హత్య కేసుల్లో వీడిన మిస్టరీ

- వివాహేతర సంబంధాలే కారణమని నిర్ధారించిన పోలీసులు
- హత్య కేసుల్లో నిందితుల అరెస్ట్


పుష్పావతి హత్యకేసులో నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

తాడిపత్రి టౌన్: వివాహేతర సంబంధాల కారణంగానే తాడిపత్రి ప్రాంతంలో రెండు హత్యలు చోటు చేసుకున్నాయని పోలీసులు తెలిపారు. వేర్వేరు ఘటనలకు సంబంధించిన హత్య కేసుల్లో నిందితులను గురువారం అరెస్ట్ చేశారు. తాడిపత్రి పట్టణ పీఎస్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను సీఐ సాయిప్రసాద్ వెల్లడించారు.

- పుట్లూరు మండలం చిప్పిడి వెంగన్నపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్రెడ్డికి 15 సంవత్సరాల క్రితం తాడిపత్రి మండలం బందర్లపల్లికి చెందిన పుష్పావతితో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వెంకటేశ్వర్రెడ్డి పెళ్లి కాకముందు నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం ఉమ్మాయిపల్లిలో నివాసముంటున్న తన పిన్నమ్మ ఇంటికి తరచూ వెళ్లి వచ్చేవారు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన అక్కిలి శ్రీలక్ష్మితో అయిన పరిచయం కాస్త వివాహేతర సంబంధానికి దారి తీసింది. అయితే శ్రీలక్ష్మికి పామిడి మండలం రామరాజుపల్లికి చెందిన రాజారెడ్డితో పెళ్లి జరిగింది. భర్త మరణించడంతో ఆమె పుట్టింటికి చేరుకుంది. ఈ క్రమంలో సులువుగా ఇద్దరి మధ్య అనుబంధం పెరిగింది. దీంతో తన భార్య పుష్పావతిని, కుమారులను వెంకటేశ్వరరెడ్డి నిర్లక్ష్యం చేస్తూ వచ్చాడు. అదే సమయంలో భర్త వివాహేతర సంబంధం విషయం తెలుసుకున్న ఆమె... ఆయనలో మార్పు రావాలని ఆకాంక్షిస్తూ ఆరు నెలలుగా పుట్టింట్లోనే ఉండిపోయింది. ఆ సమయంలో శ్రీలక్ష్మిని పిలుచుకుని నేరుగా తాడిపత్రిలోని యల్లనూరు రోడ్డులో ఉన్న అద్దె ఇంట్లోకి వెంకటేశ్వరరెడ్డి మకాం మార్చాడు. ఆ తర్వాత కాపురానికి రావాలని పుష్పావతికి తెలపడంతో వెంకటేశ్వరెడ్డి పేరు మీదున్న 9 ఎకరాల పొలాన్ని పిల్లల పేరుపై రాయాలని ఆమె పట్టుబట్టింది. ఈ అంశాన్ని వెంకటేశ్వరరెడ్డి, శ్రీలక్ష్మి వ్యతిరేకించారు. పుష్పావతి ఉంటే ఎప్పటికైనా తమకు ముప్పేనని భావించిన వారు.. పథకం ప్రకారం తాడిపత్రిలోని హేమాద్రి గెస్ట్‌హౌస్‌లో పెద్దల సమక్షంలో ఆస్తి పంపకాలపై పంచాయితీకి రావాలని కబురు పెట్టారు. దీంతో ఈ ఏడాది జనవరి 17న హేమాద్రి గెస్ట్‌హౌస్‌కు పుష్పావతి చేరుకుంది. పంచాయితీ పెద్దలతో మాట్లాడిన అనంతరం గది బయట వేచి ఉన్న పుష్పావతిపై అప్పటికే సిద్ధంగా ఉంచుకున్న వేట కొడవలితో వెంకటేశ్వరరెడ్డి దాడి చేసి, హతమార్చి ఉడాయించాడు. అనంతరం శ్రీలక్ష్మిని పిలుచుకుని అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితుడి కోసం విస్తృత గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి శ్రీలక్ష్మి ఇంట్లో ఉన్న సామగ్రిని తీసుకెళ్లేందుకు యల్లనూరు రోడ్డులో ఉన్న అద్దె గదికి వారు చేరుకోగానే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నేరాన్ని అంగీకరించడంతో వెంకటేశ్వర్రెడ్డి, శ్రీలక్ష్మిని అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.
- తాడిపత్రిలోని ఓశాంతి నగర్ నివాసముంటున్న మణికి పామిడి గ్రామానికి చెందిన యక్కలూరి మహేష్‌తో వివాహమైంది. ఈ క్రమంలో అత్తింటికి తరచూ వచ్చి వెళ్లే మహేష్... ఆ పక్కనే నివాసముంటున్న రమీజాబీతో ఏర్పడిన పరిచయంతో చాలా చనువుగా ఉండేవాడు. ఇది గమనించిన రమీజాబీ కుమారుడు సయ్యద్ ఫైరోజ్ తన పిన్నమ్మ షేక్ ఖాజాభీతో చెప్పుకుని బాధపడ్డాడు. దీంతో ఇంట్లో తరచూ గొడవలు చోటు చేసుకునేవి. ఈనెల 10న మహేష్ తన భార్య మణితో పాటు తాడిపత్రికి వచ్చాడు. 16వ తేదీ రమీజాబీతో షేక్ ఖాజాబీ, సయ్యద్ ఫైరోజ్ గొడవ పడుతుంటే వారికి సర్దిచెప్పేందుకు మహేష్ వెళ్లాడు. తమ ఇంటి గొడవలో నువ్వెందుకు కలుగ చేసుకుంటున్నావంటూ మహేష్‌పై ఖాజాబీ ఆగ్రహం చేస్తూ ఇంట్లోకి వెళ్లి కత్తి తీసుకొచ్చి ఫైరోజ్‌కిచ్చి పొడవమని ప్రోత్సహించింది. దీంతో మహేష్ పొట్టలో బలంగా పొడవంతో తీవ్ర గాయమైంది. క్షతగాత్రుడిని వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. ఈ కేసులో సయ్యద్ ఫైరోజ్, షేక్ ఖాజాబీను వారి ఇంటి వద్దనే గురువారం పోలీసులు అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

కో ఆర్డినేషన్ కమిటీని తక్షణమే ఏర్పాటు చేయండి

- డీఆర్వోకు స.హ.చట్ట పరిరక్షణ సంఘం విజ్ఞప్తి


డీఆర్వో మలోలతో మాట్లాడుతున్న సంఘాల నాయకులు

అనంతపురం కల్చరల్: సమాచార హక్కు చట్టానికి సంబంధించి జిల్లా కో–ఆర్డినేషన్ కమిటీని తక్షణమే ఏర్పాటు చేయాలని అధికారులకు సమాచార హక్కు పరిరక్షణ సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జిల్లా రెవెన్యూ అధికారి మలోలను సమాచార హక్కు పరిరక్షణ సంఘం జిల్లా అధ్యక్షుడు హొన్నూరప్ప, సమాచార హక్కు ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు లాలే నాయక్, రాయల్ కొండయ్య, ఫైట్ ఫర్ రైట్స్ సంస్థ అధ్యక్షుడు కేపీ రాజు తదితరులు గురువారం కలసి మాట్లాడారు. ఇద్దరు ఆర్‌టీఐ కార్యకర్తలతో కలిసిన కో ఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేస్తే పాలన పారదర్శకంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ పుస్తకాలను ఆవిష్కరించిన అనంతరం సాధ్యమైనంత త్వరగా ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. డీఆర్వోను కలిసిన వారిలో సమాచార హక్కు పరిరక్షణ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఇమామ్, నబీరసూల్, అనంతకుమారి, సెక్రటరీలు మహేష్ కుమార్, భానుకిరణ్, గణేష్, రామాంజనేయులు, మల్లేశ్వరి తదితరులున్నారు.

డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య


వాణి మృతదేహం

బుక్కరాయసముద్రం: మార్కులు సరిగా రాలేదంటూ తండ్రి మందలింపుతో మనస్తాపం చెంది డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... బీకేఎస్ మండలం పొడరాళ్ల గ్రామానికి చెందిన రవి కుమార్తె వాణి (20) అనంతపురంలోని కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతోంది. ఆన్‌లైన్ ద్వారా బ్యాంక్ కోచింగ్ తీసుకుంటున్న ఆమె కోచింగ్‌కు నిర్వహించిన పరీక్షల్లో మార్కులు తక్కువగా వచ్చాయి. విషయం తెలుసుకున్న తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన బుధవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

గుత్తిలో నేడు ఎస్టీయూ జిల్లా కార్యవర్గ సమావేశం

అనంతపురం ఎడ్యుకేషన్/గుత్తి: రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా మొదటి కార్యవర్గ సమావేశం శుక్రవారం గుత్తిలోని పద్మవాణి పాఠశాలలో ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు నీలూరు రమణారెడ్డి, గుత్తి మండల అధ్యక్ష, కార్యదర్శులు ఆసీఫ్, బసవరాజు, జిల్లా నాయకులు డి.శివశంకర్ తెలిపారు. ఈ మేరకు గురువారం వారు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రధాన చర్చ ఉంటుందన్నారు. అలాగే విద్యారంగంలోని పాఠశాలల మనుగడ, ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలపై చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎల్.సాయిశ్రీనివాస్, ప్రధానకార్యదర్శి ఎం.రఘునాథరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శి నారాయణస్వామి ముఖ్య అతిథులుగా హాజరవుతారని వెల్లడించారు. అన్ని మండలాల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని రమణారెడ్డి పిలుపునిచ్చారు.

కదిలిన సత్యసాయి ప్రచార రథాలు


సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథాలను ప్రారంభిస్తున్న సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు

ప్రశాంతి నిలయం: సత్యసాయి శత జయంతి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నట్లు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్‌రాజు తెలిపారు. సత్యసాయి ఆరాధన మహోత్సవాలను పురస్కరించుకుని సత్యసాయి ప్రేమ ప్రవాహిని పేరుతో ఏర్పాటు చేసిన ప్రచార వాహనాలను గురువారం ట్రస్ట్ సభ్యుడు చక్రవర్తి, నాగానంద, సత్యసాయి సేవా సంస్థల జాతీయ అధ్యక్షుడు నిమిష్ పాండ్యతో కలసి ఆయన ప్రారంభించి, మాట్లాడారు. సత్యసాయి అవతార వైభవం, సేవా మార్గాలు, ఆధ్యాత్మిక తత్వాన్ని ప్రజలకు వివరిస్తూ దేశంలోని 500 జిల్లాల్లో 2.5 లక్షల కిలోమీటర్ల మేర ప్రేమ ప్రవాహిని రథాలు ప్రచార యాత్ర కొనసాగిస్తాయన్నారు. కార్యక్రమం అనంతరం హిల్‌వ్యూ స్టేడియంలో మహానారాయణ సేవ నిర్వహించారు.

క్లుప్తంగా

స్వచ్ఛతతోనే గ్రామాల అభివృద్ధి



గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

ఆత్మకూరు: స్వచ్ఛతతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎంపీడీఓ లక్ష్మీనరసింహ తెలిపారు. గురువారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. దేశానికి పట్టు కొమ్మలు గ్రామాలే అని గాంధీజీ ఆనాడే అన్నారని గుర్తు చేశారు. గ్రామాలు బాగుంటేనే దేశం బాగుంటుందని తెలిపారు. అదే విధంగా చెత్తను రోడ్లపై వేయరాదని.. పంచాయితీ వాహనాల్లో వేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలతో పాటు ఇంటి ముందు కూడా పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎగ్గిడి వరలక్ష్మి, పంచాయతీ సెక్రటరీ చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలు ప్రోత్సహిస్తే కేసులు



బాల్య వివాహాలను నిర్మూలిస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

ఆత్మకూరు: బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలని ఏపీఎం పద్మావతి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో వెలుగు సంఘం మహిళలు సీసీలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ.. వేసవి సెలవుల్లో పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ముఖ్యంగా సెలవుల్లో చిన్న పిల్లలు బావులు, కుంటలు, చెరువుల వద్దకు ఈతకు వెళ్తుంటారని తెలిపారు. ప్రమాదవశాత్తూ నీటిలో పడి చనిపోయిన సంఘటనలు ఉన్నాయని గుర్తు చేశారు. ముఖ్యంగా ఈనెల ఆఖరున మంచి ముహూర్తాలు ఉన్నాయని ఎక్కడా బాల్య వివాహాలు జరగకుండా చూడాలని తెలిపారు. బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా చట్టరీత్యా శిక్షార్హులని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీసీలు వెంకటరాముడు, శ్రీరాములు, వెంకటనారాయణ, కొండయ్య, సాయి, అంజలి, ఎమ్ఎస్‌టీబీలు భవాని, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రక్త నమూనాల సేకరణ



వడ్డుపల్లిలో పర్యటిస్తున్న వైద్య సిబ్బంది

ఆత్మకూరు: మండలంలోని వడ్డుపల్లి గ్రామంలో గురువారం సాయంత్రం వైద్య సిబ్బంది పర్యటించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ.. బోదకాల వ్యాధి నిర్ధారణకు రక్త నమూనాలు సేకరించినట్లు తెలిపారు. గ్రామంలో సుమారు 300 మంది రక్త నమూనాలను సేకరించి ఆత్మకూరు ఆసుపత్రిలోని ల్యాబ్‌కు పంపినట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీనారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ ఓబిరెడ్డి, మలేరియా సబ్ యూనిట్ అధికారి మద్దయ్య, వైద్య సిబ్బంది షమీమ్‌తార, తులసమ్మ, నూర్‌బాషా, ఆశా వర్కర్లు, ఏఎన్ఎమ్‌లు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రాప్తాడు: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రాప్తాడు, ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాల్లోని 35 మంది రైతులకు ప్రభుత్వం సబ్సిడీతో మంజూరు చేసిన వ్యవసాయ యంత్ర పరికరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీ రవి, ఏఓ శ్రీవాణి, తహసీల్దార్ విజయకుమారి, ఎంపీడీఓ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

అనంతపురం: దేశవ్యాప్తంగా సురక్షిత రైడింగ్‌ను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో హోండా మోటార్ సైకిల్, స్కూటర్ ఇండియా (హెచ్ఎంఎస్ఐ) ఆధ్వర్యంలో పీవీకేకే, బాలాజీ కాలేజీ ఆఫ్ ఫార్మసీ, శ్రీ సాయి వెంకటేశ్వర ఐటీఐ కళాశాలలో గురువారం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రహదారి భద్రత విద్యను సులభంగా అందించడమే లక్ష్యంగా ఈ కార్యాచరణ చేపట్టారు. రోడ్డు భద్రతపై శిక్షణ, క్విజ్, గేమ్స్, హెల్మెట్ వినియోగంపై కార్యకలాపాలపై విద్యార్థుల్లో చైతన్యం తెచ్చారు. రోడ్డు భద్రత హోండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా కార్పొరేట్ సామాజిక బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. శిక్షణలో 2,400 మంది విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

మూన్నాళ్ల ముచ్చటే..!

- ఆగిన కుక్కల స్టెరిలైజేషన్
- నగరంలో యథేచ్ఛగా కుక్కల స్వైర విహారం
- పిల్లలు, వృద్ధులపై దాడులకు తెగబడుతున్న కుక్కలు
- ఆస్పత్రి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న ప్రజలు





47వ డివిజన్‌లో కుక్కల దాడిలో గాయపడ్డ ప్రభుత్వ ఉద్యోగి, అతడి తొడకు గాయం అయిన దృశ్యం



47వ డివిజన్‌లో ఓ వ్యకి చేతిని కరిచిన కుక్కలు (ఫైల్)

అనంతపురం కార్పొరేషన్: కుక్కల స్టెరిలైజేషన్ ప్రక్రియ మున్నాళ్ల ముచ్చటగానే సాగుతోంది. కుక్కల బెడదకు శాశ్వత పరిష్కారం చూపేందుకు నగరపాలక సంస్థ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలో ఈ ఏడాది జనవరిలో రాజస్థాన్‌కు చెందిన సంతులన్ జీవన్ కళ్యాణ్ ఏజెన్సీకు స్టెరిలైజేషన్ కాంట్రాక్ట్‌ను నగరపాలక సంస్థ అప్పగించింది. నగరంలోని 74 సచివాలయాల పరిధిలో 4,500 కుక్కలకు స్టెరిలైజేషన్ చేపట్టేందుకు అధికారులు నిర్ణయించారు. ఒక్కో కుక్కకు స్టెరిలైజేషన్ చేస్తే రూ.1,500 అందించేలా ఏజెన్సీ ఒప్పందం చేసుకుంది. గత నెలలో మేయర్ వసీం, కమిషనర్ బాలస్వామి చొరవతో స్టెరిలైజేషన్‌కు చర్యలు తీసుకున్నారు. కాగా సదరు ఏజెన్సీ నిర్వాహకులు సురక్షిత ప్రమాణాలతో స్టెరిలైజేషన్ చేయకపోవడంతో అధికారులు సైతం నివ్వెరపోయారు. కుక్కలకు సురక్షిత ప్రమాణాలతో స్టెరిలైజేషన్ చేయడం ముఖ్యం. కాగా అటువంటి చర్యలేమీ తీసుకోవడం లేదు. దీంతో స్టెరిలైజేషన్‌కు తీవ్ర ఇబ్బందిగా మారింది.

జీజీహెచ్‌లో సంచరిస్తున్న కుక్కలు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో కుక్కలు స్వైర్య విహారం చేస్తున్నాయి. ఇప్పటికే నగరంలో కుక్కల దాడితో ప్రజలు ప్రత్యక్ష నరకం చేస్తున్నారు. కుక్కకాటుతో ఆస్పత్రికి వచ్చే బాధితులకు సైతం ఆస్పత్రిలో కనిపిస్తున్న కుక్కలు భయాందోళనకు గురి చేస్తున్నాయి. అత్యవసర వార్డులు, ఓపీ విభాగాల్లో కుక్కలు తిరుగుతున్నాయి. ఇంత జరుగుతున్నా ఆస్పత్రి అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. గురువారం సర్వజనాస్పత్రిలో అక్యూట్ మెడికల్ కేర్ యూనిట్, ఎమర్జెన్సీ ఆపరేషన్ థియేటర్ ప్రవేశమార్గంలోకి ఓ కుక్క వచ్చింది. రోగి సహాయకులు తరుముతున్నా.. కుక్క అక్కడి నుంచి వెళ్లకపోగా బాధితులపై గట్టిగా మొరుగుతూ మీదకు వచ్చినంత పని చేసింది. ఇప్పటికైనా ఆస్పత్రి సిబ్బంది మేలుకుని తగు చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.



అక్యూట్ మెడికల్ కేర్ యూనిట్ ప్రవేశ మార్గంలో సంచరిస్తున్న కుక్క

భౌ'భోయ్'

- ఇటీవల నగరంలోని 47వ డివిజన్‌లో వాకింగ్‌కు వచ్చిన ఓ వ్యక్తిపై కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. అతడి పిక్కను పట్టిపీకాయి. ఎంత అరిచినా.. కుక్కలు వదలని పరిస్థితి. చివరకు స్థానికంగా ఉండే ప్రజలు గట్టిగా కేకలు వేయడంతో కుక్కలు పరుగులు తీశాయి. అదేవిధంగా అదే డివిజన్‌లో పలువురిపై కుక్కలు దాడి చేశాయి. చేతులను విచక్షణా రహితంగా కరిచాయి.
- ఇటీవల నగరంలోని అశోక్ నగర్‌లో ఓ బాలుడు ట్యూషన్ ముగించుకుని ఇంటికి వెళ్తుంటే ఒక్కసారిగా దాడి చేశాయి. ఇలా నగరంలోని వివిధ డివిజన్లలో కుక్కలు సంచరిస్తున్నాయి. నగరంలోని హౌసింగ్ బోర్డు, విద్యుత్ నగర్, జీసస్ నగర్, అశోక్ నగర్, పాతూరు, రాణినగర్, వేణుగోపాల్ నగర్, అరవింద నగర్, సాయి నగర్, గుల్జార్‌పేట, ఆదర్శ నగర్, 1, 2, 3, 4, 5 రోడ్లు, రజక నగర్, ఆజాద్‌నగర్, రెవెన్యూ కాలనీ తదితర ప్రాంతాల్లో కుక్కల సంఖ్య అధికరంగా ఉంది. కుక్కలు పెద్ద సంఖ్యలో గుంపులుగా రావడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు కుక్కల బెడదకు పరిష్కారం చూపాల్సిన అవసరం ఉంది.

వైఎస్సార్‌సీపీ నగర కమిటీలో చోటు



అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంలో భాగంగా వివిధ విభాగాల కమిటీలను పార్టీ అధిష్టానం ఏర్పాటు చేస్తోంది. అందులో భాగంగా పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో అనంతపురం నగర పార్టీ కమిటీలో కొందరికి అవకాశం కల్పిస్తూ.. పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. నగర ఉపాధ్యక్షులుగా అలీషేర్ ఇషాక్ మదానిబాషా, ఎం.నాగరాజు యాదవ్, పీవీ రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా కూడేటి మహేష్, కె.అనిల్ కుమార్ రెడ్డి, కొండ కమల్ భూషణ్, ఎం.శ్రీనివాసులు, కలవల సతీష్‌కుమార్, కె.మహబూబ్ బాషా, కార్యదర్శులుగా దిదేకుంట రామాంజుల రెడ్డి, సాకే రాజశేఖర్, కోట రంగారెడ్డి, ఎం.అల్తాఫ్, దూదేకుల రహీం, బిందెల నాగేంద్ర, కంబలి సులోచన, ఎం.సురేంద్ర రెడ్డి, లబ్బే ముత్యాలప్పను నియమించారు.

పది ఫలితాల్లో ప్రైవేట్ పాఠశాలల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న సెయింట్ విన్సెంట్ డీపాల్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల హెచ్ఎం అమలా మేరి

రాప్తాడు: పది ఫలితాల్లో ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. బుధవారం విడులైన ఫలితాల్లో మండలంలో ప్రవేట్ పాఠశాలల్లో 90 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ఎంఈఓ మల్లికార్జున తెలిపారు. ఎల్లార్జి హైస్కూల్ విద్యార్థులు 99 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ బొంతు ప్రసాద్ తెలిపారు. సెయింట్ విన్సెంట్ డీపాల్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు 96 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు హెచ్ఎం సిస్టర్ అమలా మేరి, కరస్పాండెంట్ సిస్టర్ జెసింతా, సుపరియర్ సిస్టర్ జ్ఞానమ్మ తెలిపారు.

పోస్టర్ల ఆవిష్కరణ

అనంతపురం మెడికల్: ప్రపంచ మలేరియా దినాన్ని పురస్కరించుకుని డీఎంహెచ్ఓ కార్యాలయంలో డీఎంహెచ్ఓ ఈబీదేవి, మలేరియాను మనతోనే అంతం చేద్దామన్న పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించి ఇంటిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా మలేరియా అధికారి ఓబులు పాల్గొన్నారు.

ఎస్కేయూ పరీక్షల షెడ్యూల్ మార్పు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో ఈనెల 29, 30 తేదీల్లో జరగాల్సిన యూజీ రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ పరీక్షలు మే నెల 2, 3 తేదీల్లో జరుగుతాయని డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. పాలిసెట్ నేపథ్యంలో డిగ్రీ పరీక్షలను వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షల్లో మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతున్న నలుగురు విద్యార్థులను డీబార్ చేసినట్లు తెలిపారు. ధర్మవరంలో ఒకరు, పామిడిలో ముగ్గురు మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతూ పట్టుబడినట్లు వెల్లడించారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

అనంతపురం కల్చరల్: మనిషి మనోవిజ్ఞాన పెంపుదలకు దోహదపడే పుస్తక పఠనం పెరిగేలా అందరూ బాధ్యత తీసుకోవాలని ఇంటాక్ కన్వీనర్, సీనియర్ న్యాయవాది రాంకుమార్ అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పీటీసీ మైదానం సమీపంలో జరుగుతున్న పుస్తక వారోత్సవాలు గురువారం కొనసాగాయి. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర నాయకులు సాకే భాస్కర్, వీరరాజు, విరూపాక్షి, తిరుపాల్, ఎర్రిస్వామి, రాజేష్ పాల్గొన్నారు.

ఉగ్రదాడి అమానుష చర్య



ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఐ నాయకులు

అనంతపురం అర్బన్: జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడి అత్యంత అమానుష చర్యని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనకు భారత సైన్యం తగిన సమాధానం ఇస్తుందన్నారు. ఉగ్రదాడిని ఖండిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో గురువారం స్థానిక క్లాక్‌టవర్ వద్ద ఉగ్రవాదుల దిష్టిబొమ్మతో ప్రదర్శన నిర్వహించి దహనం చేశారు. దాడిలో మృతి చెందిన వారికి సంతాపం ప్రకటిస్తూ నివాళులర్పించారు. పార్టీ రూరల్ మండలం కార్యదర్శి రమేష్, మల్లికార్జున మాట్లాడుతూ.. కాశ్మీర్ ప్రాంతంలో అలజడులు సృష్టించేందుకు అమాయక పర్యాటకులను ఉగ్రవాదులు కాల్చి చంపారన్నారు. ఈ దాడి తరువాత దేశ ఐక్యత మరింత బలపడిందన్నారు. ఉగ్రవాదులకు భారత సైనం తగిన సమాధానం ఇస్తుందని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి దాడులు జరగకుండా కేంద్ర ప్రభుత్వం నిఘా వ్యవస్థను మరింత బోలపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాముద, ధనుంజయ, దుర్గాప్రసాద్, అక్కులన్న, నరసింహులు, ఇమామ్, కుళ్లాయప్ప, వేణు, పాండు, సల్మాన్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

శాంతి ర్యాలీ

కనగానపల్లి: కశ్మీర్‌లో జరిగిన ఉగ్ర మూకల దాడిని నిరసిస్తూ గురువారం మండల కేంద్రంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రజా సంఘాల నాయకులు, గ్రామస్తులు కొవ్వొత్తులు వెలిగించుకొని స్థానిక మార్కెట్ సర్కిల్ నుంచి బస్టాండ్ సర్కిల్ వరకూ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా భారత్ మాతాకు జై.. ఉగ్రవాదులు నశించాలంటూ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో స్థానిక గ్రామస్తులు వీరనారాయణ, అంకె మంజునాథ్, సుబ్బరాయుడు, తిప్పయ్య, పోతలయ్య, వన్నూరప్ప, మనోహర్, పవన్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఎస్కే ధరంసింగ్ నాయక్



కనగానపల్లిలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

అనంతపురం: పహల్గాంలో ఉగ్రవాదుల చేతిలో మృతి చెందిన వారికి గురువారం జిల్లా కోర్టులో నివాళులర్పించారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఎస్కే ధరంసింగ్ నాయక్ మాట్లాడుతూ.. జమ్మూకాశ్మీర్ పహల్గాం పర్యాటక ప్రాంతంలో ఉగ్రవాదులు దేశ పౌరులతో పాటు ఇటలీ, ఇజ్రాయిల్ పౌరులను విచక్షణా రహితంగా కాల్చి చంపడం పిరికిపంద చర్యగా అభివర్ణించారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రజలు మరణించడం చాలా బాధాకరం. ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి కేంద్రం ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. నిరాయుధులైన పౌరులపై జరిగిన ఈ దారుణమైన హింసాత్మక చర్య క్షమించరానిదన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

దేవపుత్ర సాహిత్యం చిరస్మరణీయం



చం.శాస్త్రిని సత్కరిస్తున్న అనంత సాహితీవేత్తలు

అనంతపురం కల్చరల్: జిల్లా సాహిత్యంలో చిలుకూరి దేవపుత్రది ప్రత్యేక స్థానం. ఆయన ఎన్నో రచనలు చిరస్మరణీయంగా నిలిచిపోయాయని పలువురు వక్తలు కొనియాడారు. గురువారం స్థానిక విశాలాంధ్ర బుక్ హౌస్ ప్రాంగణంలో టీవీ రెడ్డి అధ్యక్షతన చిలుకూరి దేవపుత్ర 73వ జయంతిని అనంత సాహితీ సంస్థలు, తెలుగు వెలుగు సామాజిక సంస్థ సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రచయితలు, కవులు మాట్లాడుతూ.. జిల్లా సాహిత్యంలో చిలుకూరు దేవపుత్ర సామాన్యుల పక్షం వహించి ఎన్నో మానవీయ రచనలు చేశారని గుర్తు చేసుకున్నారు. అనంత సాహిత్యంలో చేసిన ప్రయోగాలు విలక్షణమైనవని తెలిపారు. దేవపుత్ర ఆశయాలను కొనసాగిస్తుండటంపై వారి కుటుంబ సభ్యులను అభినందించారు. కవి, గాయకుడు అంకె రామలింగమయ్య ఆలపించిన పద్యం ఆకట్టుకుంది. అనంతరం సీనియర్ కవి చం.శాస్త్రిని దేవపుత్ర స్మారకంగా సత్కరించారు. కార్యక్రమంలో ఈశ్వరయ్య, ప్రసాద్, తిరుపాలు, హరీష్, రసూల్, వెంకటేష్, దేవపుత్ర కుటుంబీకులు చిలుకూరి దీవెన, అన్వేష్, కవులు, విశ్రాంత అధికారులు డాక్టర్ శశాంకమౌళి, మధుర శ్రీ,. రియాజుద్దీన్, రామాంజనేయులు, గోవిందరాజులు, విశాలాంధ్ర బుక్ హౌస్ విశ్రాంత మేనేజర్ చెట్ల ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం



టవర్ క్లాక్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్ స్టాండ్‌ను ఢీకొట్టిన లారీ

అనంతపురం: నగరంలో ఓ లారీకి బ్రేకులు ఫెయిల్ కావడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాలు.. గురువారం రాత్రి చెన్నై నుంచి బయలుదేరిన లారీ.. టవర్‌క్లాక్ వద్దకు రాగానే బ్రేకులు ఫెయిల్ కావడంతో అదుపు తప్పింది. ట్రాఫిక్ పోలీసులు సిగ్నల్ చూపేందుకు కూర్చునే అరుగును ఢీ కొట్టింది. ఆ సమయంలో ఇద్దరు ట్రాఫిక్ పోలీసులు అక్కడ లేకపోవడంతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. పోలీసులు ఏమి జరిగిందో తెలుసుకునేలోపే రెప్పపాటులో లారీ అదుపుతప్పి ట్రాఫిక్ నియంత్రణకు నిలబడి ఉండే స్తంభాన్ని ఢీ కొట్టింది. లారీ డ్రైవర్ రాజేష్‌ను ట్రాఫిక్ పోలీసులు అదుపులో తీసుకున్నారు. లోడుతో ఉన్న లారీని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ట్రాఫిక్ అధికంగా ఉన్న సమయంలో ప్రమాదం జరిగి ఉంటే పెను నష్టం జరిగి ఉండేదని పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ ఐటీఐ స్థలంపై కబ్జాదారుల కన్ను

- బోర్డు నాటి తమదేనంటూ దౌర్జన్యం

అనంతపురం ఎడ్యుకేషన్: నగర నడిబొడ్డులో ఉన్న ప్రభుత్వ ఐటీఐ ఆవరణలోని ఖాళీ స్థలంపై కబ్జాదారులు కన్నేశారు. గురువారం కొందరు స్కార్పియో వాహనంలో అక్కడికు చేరుకుని హడావుడి చేశారు. ఆ స్థలం తమదేనంటూ బోర్డు నాటే ప్రయత్నం చేస్తుండగా ఐటీఐ ప్రిన్సిపాల్ రామమూర్తి, ఉద్యోగులు అడ్డుకున్నారు. సర్వే నంబరు వారి వద్ద ఉన్న రికార్డుల మేరకు వారి స్థలం రహమత్‌నగర్‌లోని నివాసాల మధ్య వస్తుందని జిల్లా సర్వే, భూ రికార్డుల అధికారి, సర్వేయర్ చెప్పినా వినకుండా ఇక్కడే వస్తుందంటూ వారు దౌర్జన్యంగా బోర్డు నాటి వెళ్లిపోయారని ఐటీఐ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో 2020లోనూ చాలా స్పష్టంగా సర్వే చేయించారని అప్పుడు కూడా జడ్జి బంగ్లా వెనుక వస్తుందని అధికారులు తెలియజేశారని గుర్తు చేశారు. మళ్లీ ఇప్పుడు కొందరు వచ్చి ఐటీఐ ఆవరణలో ఉన్న ఖాళీ స్థలమే తమదంటూ దౌర్జన్యం చేస్తున్నారని, ఈ అంశంపై కలెక్టర్‌ను కలసి ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.



ఐటీఐ ఆవరణలోని ఖాళీ స్థలంలో బోర్డు నాటుతున్న కబ్జాదారులు

ఐసీడీఎస్ పరిధిలోకి 'ప్రధానమంత్రి మాతృవందన యోజన'

అనంతపురం: ప్రధానమంత్రి మాతృవందన యోజన శిక్షణ కార్యక్రమాన్ని ఆరోగ్యశాఖ నుంచి ఐసీడీఎస్ పరిధిలోకి తీసుకురానున్నారు. ఈ నేపథ్యంలో గురువారం అనంతపురంలో ఉమ్మడి జిల్లాలో పని చేస్తున్న సూపర్‌వైజర్లు, సీడీపీఓలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్రస్థాయి అధికారులు, మెడికల్ డిపార్ట్‌మెంట్ కో–ఆర్డినేటర్లు, నోడల్ ఆఫీసర్ వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాబా జీవితం ఆదర్శం

అనంతపురం కల్చరల్: సమస్త మానవాళి అభివృద్ధిని కోరుకున్న మహామనిషి సత్యసాయిబాబా అని ప్రముఖ జ్యోతిష్య విద్వాంసుడు రఘునాథ్ గురూజీ అన్నారు. సత్యసాయిబాబా 14వ పుణ్యతిథి సందర్భంగా సాయిట్రస్టు వారు గురువారం పలు చోట్ల అన్నదానం, ఇతర సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునాథ్ గురూజీ మాట్లాడుతూ.. బాబా మనదేశంలోనే కాకుండా 186 దేశాలలోని ప్రజలకు సేవలందించిన మహనీయుడన్నారు. విద్య, వైద్యాన్ని ఉచితంగా అందించి ప్రభుత్వాలకు సంక్షేమ పథకాల సందేశాన్ని అందించారన్నారు. ప్రేమతత్వంతో లోకాన్ని ప్రభావితం చేసిన ఆయన జీవిత ఆశయాలను కాపాడుకుందామని సాయిట్రస్టు అధ్యక్షుడు విజయ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో రాఘవేంద్ర, చంద్రశేఖర్, విజయలక్ష్మి, శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడులో పోలీసుల అత్యుత్సాహం

- ఎమ్మెల్యే పరిటాల సునీత పర్యటన సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలకు తెర

రాప్తాడు: తాను వచ్చి వెళ్లే వరకూ వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలు ఎక్కడేగాని కనిపించకూడదన్న ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశాలతో పోలీసులు అత్యుత్సాహం కనబరిచారు. వివరాల్లోకి వెళితే.. వేసవి దృష్ట్యా రాప్తాడులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం ఎదుట ఆ పార్టీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రారంభం రోజున దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఫొటోలతో పాటు స్థానిక నాయకుల ఫొటోలతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ఎవరికి ఎలాంటి నష్టం లేకపోవడంతో వాటిని అలాగే ఉంచేశారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గ రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. దీంతో వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలు తొలగించాలంటూ అంతకు ముందు రోజు టీడీపీ నాయకులు పట్టుబట్టారు. ఇదే విషయాన్ని ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆమె సోదరుడు, మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారి ఆదేశాల మేరకు కానిస్టేబుల్ భాస్కర్.. వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి భవనాన్ని అద్దెకు ఇచ్చిన మంగల శ్రీధర్‌ను పోలీస్ స్టేషన్‌కు పిలుచుకెళ్లి ఫ్లెక్సీలు తొలగించాలని బెదిరింపులకు దిగారు. విషయాన్ని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుల దృష్టికి శ్రీధర్ తీసుకెళ్లడంతో వారు వెంటనే పోలీసులకు ఫోన్ చేసి ఫ్లెక్సీలు తొలగిస్తే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. దీంతో ఫ్లెక్సీలు కనబడకుండా కనీసం ఏదైనా తెర కప్పాలని పోలీసులు సూచించారు. తాము కప్పమని వైఎస్సార్‌సీపీ నాయకులు చెప్పడంతో పోలీసులు మరోసారి శ్రీధర్‌ను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించుకుని తమదైన శైలిలో వార్నింగ్ ఇవ్వడంతో భయపడిన ఆయన సప్లయర్స్‌లోని షామియానాలను తీసుకెళ్లి ఫ్లెక్సీలను కప్పివేయించారు. పోలీసుల అత్యుత్సాహంపై స్థానికులు అసహనం వ్యక్తం చేశారు. ఎవరికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉన్న ఫ్లెక్సీలపై రాజకీయం ఎందుకంటూ చర్చించుకోవడం గమనార్హం.



వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలు కనపడకుండా కప్పిన తెర